

ఓం నమో భగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర

**(జిన్నూరులో శ్రీనాన్న గారి ప్రవచనము, 14-11-97)**

**ప్రియమైన ఆత్మ బంధువులారా,**

ఈశ్వరుడు మన హృదయంలోనే ఉన్నాడు. ఈ శరీరంలోనే కాదు రాబోయే శరీరంలో కూడా మన హృదయంలో ఉంటాడు. ఈశ్వరుడు మన హృదయంలో ప్రతిష్ట అవ్వకుండా శరీరంరాదు. ఒక శరీరం మనకు కనిపిస్తోంది అంటే అక్కడ హృదయంలో ఈశ్వరుడు ఉన్నాడు. జ్ఞాననేత్రం ఉంటే ఆయన మనకు కనిపిస్తాడు. ఎక్కడో దేవుడు ఉన్నాడు, మనకు వేరుగా దేవుడు ఉన్నాడు అంటే మనకు నమ్మకం కలుగుతుంది. మన హృదయంలో ఈశ్వరుడు ఉన్నాడు అంటే నమ్మకం కలుగదు అది మన దురదృష్టం మనకు అర్హత లేనప్పుడు యోగ్యతలేనప్పుడు భగవద్గీత కోటిసార్లు చదివినా మీకు అర్ధంకాదు. శాస్త్రం మీద, ఈశ్వరుడి మీద, గురువు మీద భక్తి, గౌరవము ఉండాలి. అలా ఉంటే గాని శాస్త్రము మీకు తన హృదయాన్ని ఇవ్వదు. మీరు కాలాన్ని పాడుచేసుకోవద్దు. నిద్రలో సాధన ఏమీ జరగదు. అలాగే చనిపోయిన తరువాత కూడా సాధన ఏమీ చేయలేము. జాగ్రదావస్థలోనే మనం శ్రద్ధగా సాధన చేసుకోవాలి. పని విడిచి పెట్టకూడదు. పనికూడా దేవుడే, భగవంతుడిని నోటితో కంటే పనితో ఆరాధిస్తే ఆయన అనుగ్రహానికి తొందరగా పాత్రులవుతాము.

మనం ఏదైతే కాదో దాని గురించే ఎక్కువగా ఆలోచిస్తూ ఉంటాము. దేహానికి రోగం వస్తే ఆలోచన, మనస్సుకు బెంగవస్తే ఆలోచన మనం దేహంకాదు, మనం మనస్సు కాదు కాని ఎంతసేపు దేహానికి వచ్చిన రోగం గురించి, మనస్సులో ఉన్న బెంగ గురించి తప్ప మన హృదయంలో ఉన్న పరమేశ్వరుని చింతన జీవుడికి ఉండదు. ఇది దురదృష్టం. ఉదయం లేచినది మొదలు రాత్రి పడుకోనే వరకూ దేహం గొడవ, మనస్సు గొడవలో ఉంటాము. ఇంక ఆత్మజ్ఞానం ఏమి కలుగుతుంది? శారీరక, మానసిక ఆరోగ్యములు మన అధ్యాత్మిక అభివృద్ధికి సహకరిస్తాయి ఆహార విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ఆహర విషయంలో జాగ్రత్తగా ఉంటే శరీరము, మనస్సు మన కంట్రోలులో ఉంటాయి. శరీరము, మనస్సు మనం కాకపోయినా ఆత్మజ్ఞానం సంపాదించటానికి శరీరం, మనస్సు సహకరించాలి. కాళ్ళు సహకరిస్తేనే మనం నడవగలము. అదే విధంగా శరీరం, మనస్సు సహకరిస్తేనే మనం సాధన చేయగలము లేకుంటే సాధన చేయలేము. భౌతికంగా మీరు చేసిన పనులకు తొందరగా ఫలితం రావచ్చును. కాని మోక్షం అలారాదు. అనేక జన్మలలో నిష్కామకర్మ చేస్తే చిత్తశుద్ధి కలుగుతుంది, అనేక జన్మలు ధ్యానం చేస్తే ఏకాగ్రత కలుగుతుంది. ఏకాగ్రత, చిత్తశుద్ధి సహాయంతో మీరు మోక్షాన్ని పొందాలి. అనేక జన్మల పుణ్యం వలన నీకు

మోక్షం వస్తుందిగాని భౌతికమైన పనులకు ఫలితం వచ్చినంత వేగంగా అదిరాదు. కొంతకాలం పడుతుంది. నీవు సహనంగా సాధన చేయాలి. శరీరం మరణించక ముందు ఎవడికైతే ఆత్మానుభవం కలిగిందో శరీరం మరణించిన తరువాత వాడు ఆత్మగా నిలబడిపోతాడు. ఎవడికైతే ఆత్మజ్ఞానం కలుగలేదో శరీరం మరణించిన తరువాత ఆ జీవుడు ఇతర లోకాలకు ప్రయాణం ప్రారంభిస్తాడు. మీరు చేసిన మంచి పనులకు స్వర్గలోకంలో సన్మానాలు చేస్తారు. మీరు చేసిన చెడ్డపనులకు నరకలోకంలో పీడిస్తారు కాని అక్కడ సాధన ఏమీ జరగదు. ఈ భూమి మీద ఉండగానే సాధన చేసి ఈశ్వరుని ఆశ్రయించి, నిరంతరము ఆత్మగురించి శ్రవణం చేసి, మననం చేసి, ధ్యానం చేసి ఆత్మలో ఐక్యం కావాలి. శరీరం మరణించిన తరువాత ఏమీ రాదు. ఇది బాగా జ్ఞాపకం పెట్టుకోండి.

బ్రహ్మభూతః ప్రసన్నాత్మా న శోచతి న కాంక్షతి

సమస్సర్వేషు భూతేషు మద్భక్తిం లభతే పరామ్

బ్రహ్మములో ఐక్యము అవ్వటానికి సిద్ధముగా ఉన్నవాడు అంటే ఆ ఎక్విఫ్‌మెంట్ అంతా సిద్ధము చేసుకొన్నవాడు నిర్మలమైన మనస్సు కలవాడు దేనిని గూర్చి దుఃఖపడడు మానవుడికి దుఃఖంరావటానికి డబ్బు ఉండటం, లేకపోవటం చదువు రావటం, రాకపోవటంతో సంబంధం లేదు. మానవుడికి దుఃఖానికి కారణం మమకారం. ఆ మమకారం తొలగించుకొనే వరకు ప్రతీ జన్మలోను కూడా దుఃఖం వెంటాడుతూ ఉంటుంది. 10 కోట్లు ధనం వచ్చినా మీకు దుఃఖం నశించదు. దీని వలన సమాజంలో గౌరవం పెరుగుతుంది గాని మీ దుఃఖం నశించదు. దేహప్రారబ్ధంలో ధనం ఉంటే ధనం, చదువు ఉంటే చదువు, గౌరవం ఉంటే గౌరవం వస్తుంది. ఇవి పారమార్థిక సత్యాలు కావు. ఆత్మజ్ఞానంతో వీటికి సంబంధం లేదు. నీ మనస్సు ఎంత నిజమో ఇవికూడా అంతే నిజం.

ఈశ్వరుడు జీవులను వారివారి ప్రారబ్ధానుసారం ఆడిస్తున్నాడు. జరుగవలసినది జరిగేతీరును. జరుగరానిది జరుగనే జరుగదు ఇది నిశ్చయము. ఈ వాక్యం మీకు అర్ధమయితే ఇప్పుడే, ఇక్కడే మీ దుఃఖం నశిస్తుంది. గీత రోజూ చదువుతాముకాని అందులో ఎన్ని శ్లోకాలు మన గుండెకు తాకుతున్నాయి, ఎన్ని మన బుర్రకు పట్టుకొన్నాయి, దీని వలన మన మనస్సు ఎంతవరకు లోతుకు దిగుతోంది అనేది చూడము. గీతలో ఒక్కశ్లోకం చాలు మనం బాగుపడటానికి మీకు నచ్చిన ఒక్కశ్లోకం తీసుకొని దానిని అర్ధం చేసుకొని మననం చేయండి, అభ్యాసం చేయండి,మీరు అడగకుండానే భగవంతుడు ఆయన స్వరూపాన్ని మీకు ఇస్తాడు. మనిషి తల్లి కడుపులో నుండి బయటకు వచ్చినది మొదలు స్మశానంకు వెళ్లేవరకు ఎవడి జీవితం కూడా ఒక్క విధంగా సాగదు మనకు సంపద వస్తూ ఉంటుంది, పోతూ ఉంటుంది. వచ్చేది ఉంటే మనం ఆపు చేసిన వచ్చేస్తుంది, రానిది ఉంటే ఈశ్వరుడిని డిమాండ్ చేసినరాదు. అందువలన నీ చేతిలో ఉన్నది జారిపోతూ

ఉంటే కంగారుపడకు కంగారుపడితే నీవు ప్రసన్నాత్మకు దూరం అయిపోతావు. ఎటువంటి బుద్ధి నీకు ఆత్మజ్ఞానాన్ని పట్టి ఇస్తుందో అటువంటి బుద్ధికి దూరం అయిపోతావు. లేనిది నీకు ఒకోసారి రావచ్చును వచ్చింది అని పొంగిపోకు, ఉన్నది పోవచ్చును పోయింది అని కృంగిపోకు. నీ దేహయాత్ర నీ సంకల్పము మీద ఆధారపడిలేదు. ఈదేహం ద్వారా ఏ అనుభావాలు అయితే పొందాలో అంతవరకు ఈ దేహం ఉంటుంది. తరువాత ఒక్క క్షణం కూడా జీవుడిని ఈ దేహంలో ఉంచడు.

ఈ లోకంలోనికి మనం వచ్చిన పని ఏమిటి అంటే మనం ఎవరిమో మనం తెలుసుకోవటానికి భగవంతుడు ఒక అవకాశం ఇచ్చాడు. దేవుడు ఎక్కడో ఉన్నాడు అనుకొంటున్నావు. నీలోపల నిజమైననేనుగా ఉన్నాను అని భగవంతుడు చెపుతున్నాడు. గురువును ఆశ్రయించి ఈశ్వరుడిని త్రికరణశుద్ధిగా ఆరాధిస్తే భగవంతుడే నీకు నిజమైన నేనుగా వ్యక్తమవుతాడు. భగవంతుడు ఏ అవకాశములు అయితే మీకు ఇచ్చాడో వాటిని జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి. మీరు ప్రతీక్షణం శ్రద్ధగా ఉండి మీకు వచ్చే చిన్న చిన్నతలంపుల విషయంలో కూడా చాలా జాగ్రత్తగా ఉంటే, మీ మనస్సును నిరంతరము జాగ్రత్తగా చూసుకొంటూ ఉంటే రాబోయే జన్మలో యోగుల వంశములో మీకు జన్మను ఇస్తాను అని పరమాత్మ చెప్పాడు అంటే సాధన బాగా జరిగే కుటుంబంలో ప్రవేశపెడతాను. దురదృష్టం ఏమిటి అంటే మనం అజ్ఞాన పూరితమాటలు, అహంకార పూరిత మాటలు నమ్ముతాము గాని భగవంతుడు చెప్పిన మాటలు నమ్మము దానికి మాయ కారణం.

జీవులు తేడా తేడాగా ఉంటారు గాని అందరి హృదయంలో ఉన్న పరమేశ్వరుడు సమానంగా ఉంటాడు. నువ్వు ఏ జీవుడిని చూసినా వారిలో ఉన్న పరమేశ్వరుడిని చూడు. అప్పుడు నీకు వికారములు పుట్టవు. ఎదుటి వారిలో ఉన్న మంచిని చూసి మనం మంచిని పెంచుకోవాలి గాని వారిలో మంచిని చూసి అసూయ పడకూడదు. పది మందిలో పది రకాల మంచిలుండవచ్చు. ఆ మంచినే చూస్తూ ఉంటే అవి అన్నీ నీకు వచ్చేస్తాయి. అందరిని సమానంగా చూడు అంటే అందరి హృదయంలో ఉన్న భగవంతుడినే చూడు. అప్పుడు నా యందు భక్తి కలగటానికి జ్ఞానం కలగటానికి అర్హత, యోగ్యత పొందుతావు. నాకు సంబంధించిన జ్ఞానం, భక్తి ప్రేమ, శక్తి నీకు ఇచ్చేస్తాను అని భగవంతుడు చెపుతున్నాడు. అహంకారము అనైక్యపరస్తుంది అహంకారము వాంఛిస్తుంది. ప్రేమ వాంఛించదు, ప్రేమ సమైఖ్య పరస్తుంది. ఈశ్వరుడు, గురువు, ఆత్మ వేరు కాదు మూడు ఒక్కటే. అహంకారము ఉన్నవాడికి వేరుగా అనిపిస్తుంది. అహంకారము నశించిన వాడికి అంతా నేనే అనే అఖండ దృష్టి కలుగుతుంది. ఉద్యోగం మాని వేస్తాను అని ఒకరు భగవాన్‌తో అంటే పని విడిచిపెట్టనక్కరలేదు. పనిమానివేస్తే సోమరితనం వస్తుంది. పని మానివేస్తే నీ కుటుంబసభ్యులు ఇబ్బంది పడతారు. అది కూడా భగవంతుని సేవ క్రింద నీ కుటుంబసభ్యులకు సేవ చేయి. అందువలన పని మానవద్దు. పని చేస్తూనే అందులో ఉన్న కష్టసుఖాలను తెలుసుకొంటూనే పని ద్వారా జ్ఞానాన్ని సంపాదించాలి గాని పని మానివేస్తేజ్ఞానంరాదు. జ్ఞానం కలిగిన తరువాత కూడా వాడు పని చేస్తూనే ఉంటాడు. చేస్తున్నానని

వాడికి తెలియదు. వాడు నేనుగా చేయడు తానుగాచేస్తాడు. ఈశ్వరుడి చేతిలో పనిముట్టుగా ఉంటాడు. నేను చేస్తున్నాను అనే భావన ఉండదు. అందుచేత పుణ్యపాపములతో వాడికి సంబంధంలేదు బ్రహ్మానుభవం పొంది ఈ మూడులోకములను కాల్చిన నీకు పాపం అంటదు అని భగవంతుడు చెప్పాడు. ఆస్థితి అట్టిది. అది ఊహిస్తే రాదు. అది అనుభవైకవేద్యము, అది నీమాటకు, నీమనస్సుకు, నీ పాడు బుద్ధికి అందదు. నీకు శుద్ధ బుద్ధి ఉంటే, సాత్వికబుద్ధి ఉంటే అది సహృదయాన్ని గ్రహిస్తుంది లేనిచో హృదయంలో ఉన్న ఈశ్వరుడిని పట్టుకోలేవు.

మనకు నిజం తెలియకపోయినా ఈశ్వరుడికి నిజం తెలుసు. ఏ నిజాన్ని తెలుసుకొన్నాక మనకు మోక్షం కలుగుతుందో, శాశ్వత శాంతి కలుగుతుందో ఇటు తిప్పినా, అటు తిప్పినా ఆ నిజం దగ్గరకు మనలను తీసుకొని వెళ్లే ప్రయత్నం చేస్తాడు. మన హృదయంలో ఉన్న ఈశ్వర స్వరూపం నిజమైనది. ఆ స్వరూపాన్ని నీవు చూడలేవు కాబట్టి అదే బయట దేవతలగా కనబడుతోంది ఆ దేవతలను ఆరాధించగా, ఆరాధించగా మనకు సద్బుద్ధి కలుగుతుంది, దేవుని అనుగ్రహం కలుగుతుంది. నిజాన్ని గ్రహించే బుద్ధిని నీకు ప్రసాదిస్తాడు. మంత్రం చేస్తున్నాము ఫలితం రావటం లేదు అంటారు యాంత్రికంగా చేయటం కాదు మీరు చేసే మంత్రం మీద గౌరవం ఉండాలి, సజీవమైన విశ్వాసం ఉండాలి. ఎక్కడైతే సంకల్పం ఉందో, సాధించాలనే పట్టుదల ఉందో ఏదో రకంగా సాధిస్తాము. ఈశ్వరుడు మనకు మార్గం చూపిస్తాడు. మనం లోకానికి దూరంగా ఉండి ఈశ్వరునికి దగ్గరగా ఉంటే ఈశ్వరుడు మార్గాన్ని చూపిస్తాడు. కాని మనం ఈశ్వరుడికి దూరంగా ఉన్నాము, లోకానికి దగ్గరగా ఉన్నాము.

శరీరం మారినంత మాత్రం చేత నీకు జ్ఞానం రాదు. శరీరం ఉండగానే దానిని సద్వినియోగం చేసుకోవాలి. నీ ఇష్టదేవత గురించి నిరంతరము వినాలి. దానినే మననం చేయాలి. మీ ఇంట్లో వారితో ఇరుగుపొరుగువారితో మాట్లాడితే మీ ఇష్టదేవత గురించే మాట్లాడాలి. మీరు కూర్చున్నా, నడిచిన, భోజనం చేస్తున్నప్పటికి మీ ఇష్టదేవత స్మరణ ఉండాలి. అలా నిరంతరము స్మరణ చేస్తే ఈ జన్మలోనే ఆయన అనుగ్రహానికి పాత్రుడవుతావు ఆయన స్వరూపాన్ని నీకు ఇస్తాడు. జన్మలు మారినంత మాత్రం చేత నీ తల్లితండ్రులు, పరిసరాలు మారవచ్చు కాని నీ అహంకారము నీ కూడానే వస్తుంది. ఇప్పడే ఇక్కడే అహంకారమును వదిలించుకోవాలి. నీవు ఇల్లు విడిచిపెట్టి ఎక్కడికో పారిపోతే దృశ్యాలు మారతాయిగాని దృశ్యాలను చూసే అహంకారము మారదు. నీకు ఆత్మజ్ఞానముకలిగితేనే గాని అహంకారము నశించదు. బట్టలు మార్చు కొంటాము, పరిసరాలు మార్చుకొంటాము అంటే జ్ఞానం వచ్చివేయదు. నీకు జ్ఞానం కలగటానికి ఏ బలహీనతలు అయితే అడ్డుగా ఉన్నాయో వెతికి వాటిని తొలిగించుకోవాలి. జ్ఞానం కలగటానికి ఏ బలహీనతలు అయితే అడ్డు వస్తున్నాయో ప్రయత్నం చేసి వాటిని తొలగించుకొంటే నీకు జ్ఞానం కలుగుతుందిగాని బట్టలు మార్చినంత మాత్రం చేత, గురువులను మార్చినంత మాత్రంచేత, పరిసరాలను మార్చినంత మాత్రం చేత, దేవుళ్లను మార్చినంత మాత్రం చేత నీకు జ్ఞానం కలుగనే కలుగదు.